www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 19 | ఫిబ్రవరి | 2025 పేజీలు 8

## లంచం తీసుకుంటూ చిక్కిన అటవీ అధికారులు




**ప్రజాపక్షం/ఖమ్మం :** కాసులకు కక్కుర్తిపడి అడవి లోని మట్టిని తొలుకునేందుకు కాంట్రాక్టర్‌కు అనుమతిచ్చేందుకు లంచం తీసుకుంటూ అటవీ శాఖాధికారులు దొరికిపోయారు. ఇల్లందు పరిధిలోని అటవీ శాఖాధికారులు గతంలో కలప, ఇసుకను తరలిస్తూ అక్రమ వ్యాపారాలను ప్రోత్సహిస్తూ పట్టుబడటం జరగగా ఇప్పుడు మట్టికి అనుమతి ఇచ్చే విషయంలో రూ. 30వేలు లంచం తీసుకుంటూ ఫారెస్ట్ రేంజర్, బీట్ ఆఫీసర్ మంగళవారం దొరికిపోయారు. భద్రాద్రి కొత్తగూడెంజిల్లా ఇల్లందు మండలం కొమరారం అటవీ శాఖ పరిధిలోని మట్టిని

మిగతా 2లో..

# మిర్చిబోర్డు ఏర్పాటు చేయాలి

-నాఫెడ్ ద్వారా క్వింటా రూ. 25వేలు చొప్పన మిర్చి కొనుగోలు చేయాలి : బాగం
-ధర తగ్గింపుకు పాలకులదే బాధ్యత
-రైతు సంఘం, సిపిఐ ఆధ్వర్యంలో మిర్చి మార్కెట్‌లో ఆందోళన





**ప్రజాపక్షం/ఖమ్మం :** పడిపోతున్న మిర్చి ధరలను దృష్టిలో ఉంచుకుని తక్షణం మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. గతేడాదితో పోల్చినప్పుడు ఈ ఏడాది సగానికి పడిపోయాయని, పెట్టుబడులు గత ఏడాది కంటే రెట్టింపయ్యాయని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఆందోళన నిర్వహించారు. మిర్చి కొనుగోళ్లను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. మిర్చి మార్కెట్‌ను ముట్టడించే ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. రైతులకు,

మిగతా 2లో..

## జంకు, బొంకు లేని జయంతి బ్రదర్స్


ఫైల్

-అక్రమ రేషన్ బియ్యం తరలింపులో వారిదేపై చేయి
-కల్లూరు, పెనుబల్లి, వేంసూరు మండలాల్లో యథేచ్ఛగా అక్రమ దందా

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** జంకు, బొంకు లేకుండా జయంతి బ్రదర్స్ అక్రమ రేషన్ బియ్యాన్ని తెలంగాణ రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. ఆంధ్రా సరిహద్దుగా అక్రమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకున్న వీరు, ఊరి పేరునే ఇంటి పేరుగా మలచుకున్నారంటే అక్రమ వ్యాపారంలో ఏ విధంగా రాటు తేలారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఆంధ్రా సరిహద్దు మండలాలైన ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి నియోజకవర్గం పరిధిలో గల కల్లూరు, పెనుబల్లి, వేంసూరు మండలాల్లో పేదల బియ్యాన్ని గద్దల్లా తనుకు పోవటంలో వీరిది అందెవేసిన చేయి. కల్లూరు మండలం చంద్రుపట్ల గ్రామానికి చెందిన వారిని ముఠా సభ్యులుగా ఏర్పాటు చేసుకున్నారు జయంతి బ్రదర్స్. ముగ్గురు అన్నదమ్ములు, ముగ్గురు మొనగాళ్ళలా కలిసికట్టుగా ఉంటూ, ఒక్కొక్కరు ఒక్కో పనిని పంచుకుని

మిగతా 2లో..

## ఆధునిక పద్ధతులతో సాగు చేయాలి



-మట్టి పరీక్షలను సామర్థ్యం మేరకు నిర్వహించాలి
-చీమలపాడులో రైతులతో ముచ్చటించిన కలెక్టర్

**ప్రజాపక్షం/కారేపల్లి:** ఆధునిక పద్ధతులను పాటించి లాభదాయకంగా వ్యవసాయ సాగు చేయాలని జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్, సింగరేణి మండలం చీమలపాడు గ్రామంలో పర్యటించి రైతులతో వివిధ అంశాలపై మాట్లాడారు. చీమలపాడు గ్రామంలో వెంకటేశ్వర్లు రైతుకు చెందిన పామాయిల్ పంటను, శ్రీనివాసరావుకు చెందిన డ్రాగన్ ఫ్రూట్ పంటను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. డ్రాగన్ ఫ్రూట్ పంట, ఆయిల్ ఫామ్ సాగు, విద్యుత్, ఇతర సమస్యలపై పంట పొలం వద్ద చెట్టు నీడన క్రింద కూర్చొని జిల్లా కలెక్టర్ రైతులతో ముచ్చటించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ సాగునీటి వసతి ఎంత వరకు ఉంది. పంటల దిగుబడి, రైతులకు గిట్టుబాటు అవుతుందా వంటి పలు అంశాలను ఆరా తీసి పలు సూచనలు చేశారు. అటవీ ప్రాంతమైనందున విద్యుత్ కనెక్షన్ల్ పొలాలకు అధికంగా లేవని, సబ్సిడీతో పొలాల వద్ద మోటార్లకు సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాకు చర్యలు చేపడతామని అన్నారు. ఆసక్తి

మిగతా 2లో..

# మిర్చిబోర్డు ఏర్పాటు చేయాలి





(మొదటిపేజీ తరువాయి)

పోలీసులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. పెద్ద సంఖ్యలో రైతులు హాజరు కావడంతో విధి లేక పోలీసులు మార్కెట్‌లోకి అనుమతించారు. రైతు సంఘం, సిపిఐ నాయకులు రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు ఆందోళనకారుల వద్దకు వచ్చి అధికారులు, వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని ధర పెంపుకు సంబంధించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి బాగం హేమంతరావు మాట్లాడుతూ మిర్చిబోర్డు ఏర్పాటుతోనే మిర్చి ధరలకు పరిష్కారం లభిస్తుందన్నారు. రోజు రోజుకు మిర్చి ధర పడిపోతుందని నాఫెడ్‌ను రంగంలోకి దించి మిర్చి క్వింటా ఒక్కింటికి రూ. 25వేల చొప్పున కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మిర్చి ధర తగ్గింపుకు సంబంధించి పాలకులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. పెట్టుబడి ఆధారంగా మద్దతు ధరను నిర్ణయించాలని అనేక ఏళ్లుగా ఆందోళనలు జరుగుతున్నప్పటికీ పాలకులు స్పందించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగం పట్ల వివక్ష ప్రదర్శిస్తుందని, రైతుల సంక్షేమాన్ని పూర్తిగా మరిచిపోయిందని హేమంతరావు ఆరోపించారు. వ్యవసాయ రంగాన్ని కూడా కార్పొరేట్లకు అప్పగించాలని కేంద్రం కుట్ర చేస్తుందన్నారు. నూటికి 60 శాతం మంది ఆధారపడిన వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతుంటే పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వ్యవసాయ ఉత్పత్తి ధరలను స్థిరీకరించి సాగుకు గిట్టుబాటయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మిర్చి ధర తగ్గింపు విషయంలో వ్యాపారులు, అధికారులు సిండికేట్‌గా మారుతున్నారని ఆయన తెలిపారు. మిర్చి ధర తగ్గింపుపై తగు చర్యలు తీసుకొని పక్షంలో మార్కెట్‌లో వ్యాపార లావాదేవీలను స్తంభింపజేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, మిడికంటి చిన్నవెంకటరెడ్డి, రావి శివరామకృష్ణ, జాగర్లమూడి రంజిత్, ఏపూరి రవీంద్రబాబు, మందడపు రాణి, రైతు సంఘాల నాయకులు పుచ్చకాయల సుధాకర్, బానోత్ రాంకోటి, నూనెశశిధర్, బాగం ప్రసాద్, కూచిపూడి రవి, ప్రసాద్, ఇటికాల రామకృష్ణ, యడ్లపల్లి శంకరయ్య, పొద్దుటూరి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక పద్ధతులతో సాగు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)



అర్హత కలిగిన ప్రతి రైతుకు సోలార్ ప్యానల్స్ దశల వారీగా ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆయిల్ ఫామ్ పంట సాగు వల్ల చాలా లాభాలు ఉంటాయని, అంతర్ పంటల ద్వారా మొదటి 3 సంవత్సరాలు ఆదాయం వస్తుందని, ఆయిల్ ఫామ్ పంట దిగుబడి ప్రారంభమైన తర్వాత సంవత్సరానికి లక్షకు తగ్గకుండా రైతులు ఆదాయం సంపాదిస్తారని అన్నారు. డ్రాగన్ ఫ్రూట్ పంటకు కోతుల సమస్య ఉందని, సోలార్ ఫెన్సింగ్ వేయడం ద్వారా సమస్య పరిష్కారమయ్యే అవకాశాలు ఉంటాయని రైతులకు సూచించారు. డ్రాగన్ ఫ్రూట్ పంట ఎక్కడ అమ్ముతున్నారో తెలుసుకున్న కలెక్టర్, రైతుల వద్ద నుండి నేరుగా కొనుగోలు చేసేలా కార్యాచరణ చేయాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు. మోర్, డి మార్ట్ వంటి షాపులతో మాట్లాడి పెద్దగా పంట పండే గ్రామాలకు నేరుగా వచ్చి కొనుగోలు చేసేలా చూడాలని అన్నారు. డ్రాగన్ ఫ్రూట్ పంట ఒక సారి వేస్తే 20 సంవత్సరాల వరకు పంట వస్తుందని, నేరుగా రైతుల నుండి కొనుగోలు చేసేలా చేస్తే రైతులకు అధిక లాభాలు వస్తాయని ఆ దిశగా మన కార్యాచరణ ఉండాలని అన్నారు. ప్రజలకు కూడా డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు. డ్రాగన్ పంటల వద్ద సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు అందించాలని తెలిపారు. రైతు పొలాల సాయిల్ టెస్టింగ్ పకడ్బందీగా చేయాలన్నారు. వేసవి కాలంలో మట్టి పరీక్షలు చేయాలని, రాబోయే నెల నుండి సామర్థ్యం ప్రకారం మట్టి నమూనా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. అటవీ రక్షణ చట్టాల కారణంగా విద్యుత్తు లైన్లు ఏర్పాటు కష్టతరం అవుతుందన్నారు. రైతులకు అవసరమైన సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు కార్యాచరణ ప్రారంభిస్తామని తెలిపారు. రైతుల పంటలు ఎండిపోకముందే ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తు పనులు వేగవంతంగా పూర్తి చేస్తామని అన్నారు. అనర్హులకు ఎవరైనా ఇందిరమ్మ ఇండ్లు అందిచే వివరాలు అందిస్తే విచారించి చర్యలు చేపడతామని తెలిపారు. ఉపాధి హామీ క్రింద రైతులకు నీటి గుంటలు ఏర్పాటుకు అవకాశం ఉందని, అవసరం, ఆసక్తి గత రైతులుకు ముందుకు వస్తే వారి పొలాలలో ఉపాధి హామీ నిధులు వినియోగించి నీటి గుంటలు ఏర్పాటు చేస్తామని, గ్రామ సభలలో తీర్మానం చేస్తే పనులు ప్రారంభమవుతాయని అన్నారు. చెరువు నీళ్లు వినియోగించేలా చెక్ డ్యాం నిర్మాణ అవకాశాలు పరిశీలిస్తామని అన్నారు. సన్న రకం వడ్లకు సంబంధించిన బోనస్ నివేదికలు ప్రభుత్వానికి అందాయని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే నిధులు విడుదల చేయడం జరుగుతుందన్నారు. రైతు రుణ మాఫీ సాంకేతిక సమస్యలను పరిష్కరించి అర్హులైన రైతులందరికీ అందేలా చర్యలు చేపడతామని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి పుల్లయ్య, సింగరేణి మండల తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీవో సురేందర్, విద్యుత్ శాఖ ఏడి ఆనంద్, ఉద్యానవన శాఖ అధికారి వేణు, పంచాయితీ సెక్రటరీ కె రామకృష్ణ, ఆర్ఐ, ఏపివో, సంబంధిత అధికారులు, రైతులు, తదితరులు ఉన్నారు.

## వినికిడి పరికరం అందజేత



ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండలంలోని బుద్ధారం ప్రాథమిక పాఠశాలలోని బోయిన నందిత అనే విద్యార్థిని వినికిడి లోపం ఉంది. గుర్తించిన విద్యాశాఖాధికారులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సదరు విద్యార్థిని వినికిడి పరికరం ను సమగ్ర శిక్ష మంజూరు చేయించారు. ఈ పరికరం ను మంగళవారం విద్యార్థికి మండల విద్యాశాఖాధికారి చలపతిరావు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు షరీఫ్, భాగ్యలక్ష్మి, జైపాల్, మంగమ్మ, చారీ, సాంబశివరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ చిక్కిన అటవీ అధికారులు

(మొదటిపేజీ తరువాయి)

తొలుకునేందుకు ఫారెస్ట్ రేంజర్ ఉదయ్‌కిరణ్, బీట్ ఆఫీసర్ హీరాలాల్ కాంట్రాక్టర్ వద్ద గతంలో రూ. 20 వేలు తీసుకుని మట్టి తొలుకునేందుకు అనుమతించారు. కాంట్రాక్టర్ మట్టిని తొలుకుంటుండగా అటవీ శాఖ సిబ్బందిని పంపి జేసిబిని, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటిని విడిచిపెట్టేందుకు రూ. 15వేలు లంచం తీసుకున్నారని తిరిగి గ్రావెల్ తొలుకునేందుకు రూ. 50వేలు డిమాండ్ చేశారని కాంట్రాక్టర్ తెలిపారు. చివరకు రూ. 30వేలకు ఒప్పందం కుదిరిందని ఈ క్రమంలో కాంట్రాక్టర్ ఏసిబిని ఆశ్రయించాడు. లంచం ఇస్తుండగా ఏసిబి డిఎస్‌పి రమేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి పట్టుకున్నారు. రేంజర్ ఉదయ్‌కిరణ్‌ను, బీట్ ఆఫీసర్ హీరాలాల్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## జంకు, బొంకు లేని జయంతి బ్రదర్స్

(మొదటిపేజీ తరువాయి)


ఫైల్

అక్రమ వ్యాపారంలో కోట్లు కూడపెట్టారు. పెనుబల్లి, కల్లూరు మండలాల్లోకి చీకటి పడగానే చొరబడతారు ఈ అక్రమ వ్యాపారులు. ఒక్కో వాహనాన్ని చాకచక్యంగా మారుమూల ప్రదేశాలకు పంపి, దళారుల నుండి పెద్ద మొత్తంలో అక్రమ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి గుట్టు చప్పుడు కాకుండా సరిహద్దులను దాటిస్తారు. కల్లూరు, పెనుబల్లి పోలీస్ స్టేషన్లలో వీరికి సంబంధించిన వాహనాలు పట్టుబడ్డాయి. ఇదే విధంగా గత రెండు రోజుల క్రితం టేకితం మండలంలో కుప్పెనకుంట్లకు వెళ్లే రహదారిలో తెలంగాణ, ఆంధ్రాలో నుంచి తెచ్చిన అక్రమ రేషన్ బియ్యాన్ని జయంతి బ్రదర్స్ పేర్లపై ఉన్న వాహనాలలోకి లోడ్ చేస్తుండగా విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీస్‌లు దాడులు నిర్వహించి రేషన్ బియ్యం తో పాటు వాహనాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. పట్టుబడిన డ్రైవర్ పర్సా రవిని మీడియా వారు ప్రశ్నించగా రామారావు అనే వ్యక్తి తనను పంపించాడని, ముత్తుగూడెం వద్ద కాలువ పక్కన గల మామిడి తోటలో ఇద్దరు వ్యక్తులు వచ్చి అక్రమ రేషన్ బియ్యం ఇస్తారని, వాటిని లోడ్ చేసుకొని ఉన్న వాహనం వద్దకు తీసుకువెళ్లి లోడ్ చేసి, మరో చోటకు వెళ్ళమన్నాడని ఈ లోపు పోలీస్ వారు తమను పట్టుకున్నారని చెప్పాడు. గతంలో కూడా కల్లూరు మండలంలోని రఘునాథబంజర, చిన్న కోరుకొండి గ్రామాలలో జయంతి బ్రదర్స్ కు చెందిన వాహనాలు పట్టుబడ్డాయి. వరుసగా వాహనాలు పట్టుబడినా వారికున్న పలుకుబడితో వారిపై కేసులు కాకుండా డ్రైవర్లపై, ముఠా సభ్యులపై కేసులయ్యేలా వ్యవహరిస్తూ తప్పించుకుంటున్నారని ప్రజాస్వామ్యవాదులు చెప్పుకోవడం విశేషం. గతంలో రెండు, మూడు టన్నుల బియ్యం తరలిస్తూ పట్టుబడిన ఆంధ్రా వ్యాపారులపై 420 కేసులు పెట్టారని, వరుసగా జయంతి బ్రదర్స్ కు చెందిన వాహనాలు పట్టుబడుతున్నా అక్రమ వ్యాపారం లేకుండా చేస్తున్న వీరిపై ఎందుకు బలమైన సెక్షన్లు నమోదు చేయడం లేదని, పేదల బియ్యాన్ని గద్దల తన్నుకుపోతున్న జయంతి బ్రదర్స్ లాంటి వారిపై 420 ఆపైన కేసులు నమోదు చేసి వారి ఆట కట్టించాలని ప్రజాస్వామ్యవాదులు కోరుతున్నారు.

## వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడంలో మైనింగ్ రంగందే కీలక పాత్ర

**-ఎంఈఏఐ జాతీయ సదస్సులో సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్**




ప్రజాపక్షం/ఖమ్మం: మన దేశాన్ని 2047 నాటికి అగ్రదేశంగా తీర్చిదిద్దేందుకు రూపొందించుకున్న వికసిత్ లక్ష్యాలను చేరుకోవడంలో మైనింగ్ రంగం పాత్ర అత్యంత కీలకమని, ముఖ్యంగా క్రిటికల్ మినరల్స్ రంగంలో గణనీయమైన పురోగతి సాధించాల్సిన అవసరం ఉందని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రోత్సాహంతో క్రిటికల్ మినరల్స్ అన్వేషణలో ఉన్న అవకాశాలపై సింగరేణి ఆధ్వర్యంలో అధ్యయనానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా మైనింగ్ రంగంలో సంస్కరణలు తీసుకురావడం, బడ్జెట్లో ప్రత్యేక నిధులను కేటాయించడం ద్వారా ఈ రంగంపై దృష్టిసారిస్తోందన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలో బొగ్గు , ఇనుము తదితర ఖనిజాన్వేషణ పెద్ద ఎత్తున సాగుతోందని, రానున్న రోజుల్లో క్రిటికల్ మినరల్స్ కు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ ఛాప్టర్ ఆధ్వర్యంలో ఖనిజ అన్వేషణ ఆత్మనిర్భర్ వికసిత భారత్ 2047 వైపు ముందడుగు అన్న అంశంపై హైదరాబాద్ లో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. లిథియం, కోబాల్ట్, నికెల్ తదితర అరుదైన ఖనిజాల అన్వేషణ చేపట్టడం ద్వారా భవిష్యత్ టెక్నాలజీ అభివృద్ధికి దోహదపడిన వాళ్లం అవుతామన్నారు. ముఖ్యంగా మన దేశాన్ని 2070 నాటికి నెట్ జీరో గా మార్చాలన్న లక్ష్యాన్ని చేరుకోవడానికి ఈ అరుదైన ఖనిజాల అన్వేషణ ప్రస్తుతం అత్యవసరమన్నారు. వీటి కోసం పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తూ అనుమతుల జారీని వేగవంతం చేయడం ద్వారా ముందడుగు వేయొచ్చన్నారు. అదే సమయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్ లాంటి అత్యాధునిక సాంకేతికతలను మైనింగ్లో విస్తృతంగా ఉపయోగించుకోవాలన్నారు. అక్రమ మైనింగ్ను నిరోధించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడవచ్చన్నారు. ఈ సదస్సులో ఎన్ ఎం డీ సీ డైరెక్టర్ కమర్షియల వి.సురేశ్, డైరెక్టర్ టెక్నికల్ , ఎంఈఏఐ హైదరాబాద్ ఛాప్టర్ ఛైర్మన్ వినయ్ కుమార్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.విశ్వనాథ్, సలహాదారు ఎ.కె.శుక్లా, విశ్రాంత డైరెక్టర్ సత్పతి, ఎన్ఎల్‌సీ విశ్రాంత సీఎండీ సురేంద్ర మోహన్ మాట్లాడారు. సింగరేణి జీఎం కో ఆర్డినేషన్ ఎస్డి.ఎం.సుభానీ, ఎంఈఏఐ సభ్యులు, మైనింగ్ రంగ నిపుణులు పాల్గొన్నారు.

# పలువురికి నివాళులర్పించిన మాజీ మంత్రి పువ్వాడ





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మంగళవారం పర్యటించి పలువురికి నివాళులర్పించారు. ఇటీవల మృతిచెందిన మాజీ కార్పొరేటర్ మచ్చా నరేందర్ సతీమణి శోభారాణికి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నివాళులర్పించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. బిఆర్ఎస్ నాయకుడు ఏడవ డివిజన్ చెందిన పొదిల పాపారావు సతీమణి పార్వతి గుండెపోటుతో మృతిచెందారు. ఆమె భౌతికాయాన్ని పువ్వాడ అజయ్‌కుమార్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. సిపిఐ నాయకులు పుచ్చకాయల కృష్ణ మనవడు గీతాన్స్ బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో మృతిచెందాడు. వారి భౌతికాయాన్ని పువ్వాడ అజయ్‌కుమార్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, సొసైటీ ఛైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, కార్పొరేటర్లు నాగండ్ల కోటేశ్వరరావు, కూరాకుల వలరాజు, నాయకులు మోతారపు సుధాకర్, దేవభక్తిని కిషోర్, దొంగల తిరుపతిరావు, చిలకల వెంకటనర్సయ్య, వెంకటేశ్వర్లు, శ్రీను, ప్రసాద్, శ్రీహరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కంటి సమస్యలు లేకుండా చర్యలు

**డిఎంఅండ్‌హెచ్‌వో కళావతి బాయి**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యార్థులకు కంటి సమస్యలు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ బి. కళావతి బాయి తెలిపారు. ఖమ్మంజిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన కంటి పరీక్షల ప్రత్యేక వైద్య శిబిరాన్ని డిఎంఅండ్‌హెచ్‌వో కళావతి బాయి సందర్శించి కంటి పరీక్షల తీరును పరిశీలించారు. వైద్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఆర్‌బిఎస్‌కె టీములు ఆప్తాలమిక్ అధికారులు రెండు విడతలుగా అన్ని స్కూళ్లలోని విద్యార్థులకు స్క్రీనింగ్ నిర్వహించి 3,500 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వారికి కంటి వైద్యులచే స్క్రీనింగ్ జరిపి అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్నామని ఆపరేషన్ అవసరం అనుకుంటే వారిని హైదరాబాద్ పంపి తగిన చికిత్సలు అందించేలా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థుల్లోని కంటి సమస్యలను పరీక్షించి వారి బంగారు



భవిష్యత్తుకు బాటలు వేసేలా వైద్యులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ చందు నాయక్, డెమో సాంబశివరెడ్డి, కంటి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 21న జరిగే మహాసభను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ తల్లాడ :** తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్(టియుసిఐ అనుబంధం) రాష్ట్ర నాలుగో మహాసభ ఈనెల 21న రామనర్సయ్య విజ్ఞానకేంద్రం ఖమ్మంలో జరుగుతుందని, ఈ మహాసభను జయప్రదం చేయాలని ప్రగతిశీల హమీలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం తల్లాడ పట్టణంలో హమాలీ అండ్ వర్కర్స్ యూనియన్ తల్లాడ బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 5లక్షల మందికి పైగా వివిధ రంగాల్లో హమాలీ కార్మికులు ఎగుమతి, దిగుమతిలు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా వ్యవసాయ మార్కెట్, రైస్ మిల్, సివిల్ సప్లయి ఎఫ్‌సిఐ, గ్రానైట్ మార్బుల్, ప్రభుత్వ, ప్రైవేట్ గోడౌన్లో, ఆర్టిసి ట్రాన్స్‌ఫోర్ట్ తదితర రంగాల్లో పనిచేస్తున్న హమాలీలు ఒక్కరోజు ఎగుమతులు, దిగుమతులు నిలుపుదల చేస్తే ఎక్కడ పని అక్కడే ఆగిపోతుందని, కాని పాలకులు నేటికి ఎటువంటి చట్టబద్ధమైన హక్కులు కల్పించకపోవడంతో శ్రమ దోపిడికి గురవుతున్నారన్నారు. హమాలీ కార్మికులకు చట్టబద్ధత కల్పించాలని అనేకసార్లు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హమాలీ హక్కులకు చట్టబద్ధత కల్పించి వారికి అనేక సంక్షేమ పథకాలు అందించాలని, ప్రస్తుతం పెరిగిన నిత్యావసర ధరలకనుగుణంగా హమాలీ వేతనాలు పెంచాలని, హమాలీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకై నిర్వహించనున్న మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్కే లాల్మియా, తల్లాడ బ్రాంచ్ కమిటీ నాయకులు పటాన్ నాగుల్, మీరా, రమణ, సిహెచ్ రామకృష్ణ, రంగారావు, వెంకటేశ్వర్లు, టి.శ్రీను, కృష్ణ, బడేమియా, నరేష్, వెంకన్న, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాద బాధితుడిని పరామర్శించిన ఈటెల

**ప్రజాపక్షం/ఖమ్మం :** మండల కేంద్రంలో ఆర్వోబిపై ఇటీవల జరిగిన ప్రమాదంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గుగులోత్ నాగేశ్వరరావు సోదరుడు గుగులోత్ వసంతరావు తీవ్ర గాయాలై ఖమ్మం ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ బాధితుడు వసంతరావును మంగళవారం పరామర్శించి, ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ.. కేంద్రం రోడ్డు ప్రమాద బాధితులకు ఆదుకునేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని అన్నారు. క్యాష్ లెస్ ట్రీట్మెంట్ టు రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్ పేరిట కొత్త స్కీమ్ ప్రకటించదని అన్నారు. 24 గంటల్లో రూ.1.5 లక్షల తక్షణ సాయం, హిట్ అండ్ రన్‌లో మృతి చెందిన వ్యక్తి ఫ్యామిలీకి రూ.2లక్షలు అందజేసేలా ఇప్పటికే పలు రాష్ట్రాల్లో పైలెట్ ప్రాజక్టుగా ప్రకటించరని తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో ఈ స్కీమ్‌ను అమలు పరిచేలా కృషి చేస్తామని అన్నారు. పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యే పెత్తి శుభాస్‌రెడ్డి, శనంపూడి సేదిరెడ్డి, ఎమ్మెల్సీ ఇంచార్జి చడా శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, డాక్టర్ శీలం పాపారావు, శైలందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్‌రాథోడ్, జిల్లా ఉపాధ్యక్షులు బోయినపల్లి చంద్రశేఖర్, ఖమ్మం అసెంబ్లీ ఇంచార్జి అల్లిక అంజయ్య, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు ఉపేందర్‌గౌడ్, మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, చావా కిరణ్, చంద్రశేఖర్, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** కాంగ్రేస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హమీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని బిఆర్ఎస్ యువజన నాయకులు రావూరి సురేష్ ఆరోపించారు. మంగళవారం ఆయన కొణిజర్లలో మాట్లాడుతు బిఆర్ఎస్ హయాంలో అన్నివర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని అన్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు పెట్టుబడిసాయంకింద రైతుబంధు సంవత్సరానికి రెండు సార్లు వేశారని కేంగ్రేస్ హయాంలో సంవత్సరకాలం దాటినా ఒక్కసారి పంటపెట్టుబడికి కూడా రైతుభరోసా ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రేస్‌పార్టీకి ప్రజల్లో పూర్తి వ్యతిరేకత వచ్చిందని ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హమీని కూడా అమలు చేయలేదని అన్నారు. వచ్చే ఎంపిటిసి ఎన్నికల్లో రిజర్వేషన్ బిసి వస్తే చిన్నమునగాల ఎంపిటిసి గా పార్టీ అవకాశం కల్పిస్తే పోటీచేసేందుకు తాను సిద్దంగా ఉన్నట్లు తెలిపారు.

# సర్వజ్ఞ విద్యార్థులకు బంగారు పతకాలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు రోలర్ స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రెండవ తెలంగాణ ర్యాంకింగ్ ఓపెన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఖమ్మం జిల్లా తరుపున సర్వజ్ఞ పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న విద్యార్థిని జి. కర్ణిక, జి. త్రినయన్ ఉత్తమ ప్రతిభ చూపి బంగారు, వెండి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వి నాగేంద్రకుమార్, కె. నీలిమ లు మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యతోపాటు అన్ని రంగాల్లో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. క్రీడలకు ప్రాధాన్యతనిస్తున్నట్లు వారు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి దానికి అనుగుణంగా తమ పాఠశాలలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. బంగారు, వెండి పతకాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పవిత్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అటానమస్ హోదా లభించడం అభినందనీయం




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలకు హైదరాబాద్ నుంచి అటానమస్ హోదా లభించడం అభినందనీయం అని, కళాశాల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీ విద్య అన్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఖమ్మంరూరల్ మండలం పొన్నెకల్లుపంచాయతీపరిధిలోని కళాశాలలో ఫ్యాకల్టీ, విద్యార్థులతో కలిసి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు...విద్యార్థులకు విలువతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్న తమ కళాశాలకు ఈ విజయం లభించిందన్నారు. కళాశాల యాజమాన్యం మౌలిక సదుపాయాలు, నిష్ణాతులైన అధ్యాపకులులతో బోధన,క్యాంపస్ ప్లేస్‌మెంట్‌ల ద్వారా ఈ అరుదైన గౌరవం దక్కిందన్నారు. ఈ సందర్భంగా యాజమాన్యం, ఫ్యాకల్టీ, విద్యార్థులకు చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక, కళాశాల ఎగ్జిక్యూటీవ్ డీన్ డాక్టర్ వి. సుదర్శన్, కళాశాల ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, ప్రిన్సిపాల డాక్టర్ మురళికృష్ణ, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ వైశాలి, డిప్లొమా ఇన్చార్జ్ సిహెచ్ కృష్ణప్రసాద్, వివిధ విభాగల అధిపతులు డాక్టర్ హరిప్రసాద్, డాక్టర్ చిరంజీవి, శ్రీకుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ప్రజలను సమన్వయం చేస్తూ గ్రామాలను పంచాయతికార్యదర్శులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, డిఎల్‌పిఓ రాంబాబు అన్నారు. మంగళవారం ఖమ్మంరూరల్ మండల పర్యటనలో భాగంగా పొన్నెకల్లు పంచాయతీని సందర్శించారు. గ్రామపంచాయతీ రికార్డులు, నర్సరీ, వైకుంఠధామం, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులను పకడ్బంధీగా నిర్వహించాలన్నారు. రోజూ పారిశుధ్య పనులను చేపట్టి మురుగునీరు రోడ్లపై నిలిచి ఉండకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి సూచించారు. అలాగే గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై దృష్టి పెట్టి త్వరితగతిన పూరైయ్యేటట్టు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీదేవి, గ్రామ కార్యదర్శి తిలక్ పాల్గొన్నారు.

# టిడిపి సభ్యత్వ నమోదులో ఖమ్మం జిల్లా ముందంజ



**ప్రజాపక్షం/ తల్లాడ :** తెలంగాణ రాష్ట్ర రాజధాని హైద్రాబాద్‌లో టిడిపి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్రస్థాయి టిడిపి సమావేశం మంగళవారం జరిగింది. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు, జిల్లా వారీగా జరిగిన సభ్యత్వ నమోదుపై చర్చించడం జరిగింది. సభ్యత్వ నమోదులో ఖమ్మం జిల్లా ముందంజలో ఉందని రాష్ట్ర నాయకులు అభినందించారు. ఈ సమావేశంలో రానున్న రోజుల్లో గ్రామాల వారీగా గ్రామకమిటీలు ఏర్పాటు చేసే విషయంపై చర్చించారు. అదేవిధంగా భవిష్యత్‌లో తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం ప్రతిఒక్క కార్యకర్త కృషి చేయాలని పిలుపునివ్వటం జరిగింది. టిడిపి సభ్యత్వం అత్యధికంగా నమోదు చేయించిన తల్లాడ మండల నాయకులు, జిల్లా నాయకులను రాష్ట్ర నాయకులు అభినందించి మెమోంటో ఇచ్చి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కేతినేని హరిచంద్ర, మాజీ ఎఎంసి వైస్‌చైర్మన్ దూపాటి భద్రరాజు పాల్గొన్నారు.

# పది ఫలితాలు భవిష్యత్ లక్ష్యాలకు మార్గదర్శకాలు

**- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**




**ప్రజాపక్షం/ఖమ్మం :** పదవ తరగతి ఫలితాలు విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాలను సాధించడానికి మార్గదర్శకాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో షెడ్యూల్ కూలాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ప్రేరణ శిక్షణ తరగతులను విద్యార్థులకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా హాజరైన ఆయన ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో ఎన్ని మార్కులు వస్తాయని విద్యార్థులు ఆశించకుండా వారి భవిష్యత్ లక్ష్యాలను చేరుకునేందుకు కష్టపడి చదవాలన్నారు. కేవలం పదో తరగతిని మాత్రమే ప్రామాణికంగా తీసుకోరాదని, ఇది ఒక మెట్టుమాత్రమే అన్నారు. నిరంతరం కష్టపడుతూ ఉంటే లక్ష్యాలను చేరుకోవడం సులభం అవుతుందని, తాను కూడా విద్యార్థి దశలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నట్లు చెప్పారు. ముందుగా ఇంజనీర్ అవుదామని అనుకున్నానని, ఆ తర్వాత లక్ష్యాన్ని మార్చుకుని ఐఏఎస్ సాధించినట్లు చెప్పారు. విద్యార్థులు భవిష్యత్‌పై మంచి గోల్ కలిగి ఉండాలని, ఆ లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరం తపిస్తూశ్రమిస్తూ ఉండాలన్నారు. ప్రభుత్వ బడుల్లో మంచి సౌకర్యాలు ఉన్నాయని,వసతి గృహాల్లో ప్రత్యేక స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పరీక్షలురాసేందుకు కొన్ని రోజులు మాత్రమే సమయం ఉన్నందున ప్రతి నిమిషాన్ని వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. టీవి, ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు స్టడీ హవర్స్ నిర్వహించి నూరు శాతం ఫలితాలు జిల్లాలో వచ్చేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యాశాఖ రిసోర్స్ పర్సన్స్ సైదులు, నాగరాజు, శేఖర్, విజయ భాస్కర్, శ్యాంచందర్‌లు విద్యార్థులకు వివిధ సబ్జెక్టుల్లో మెలుకువలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖాధికారి అనసూయ, ఏఎస్‌డబ్ల్యూఓలు హనుమంతరావు, సునీత, హెచ్‌డబ్ల్యూఓలు గజ్వేల్ శ్రీనివాస్, పద్మావతి, శశిరేఖ, కౌసల్యరామ, నరసయ్య, స్వప్న, కార్యాలయ సిబ్బంది నర్సింహారావు, పార్వతి, శశికళ, హేమంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌ఒబి మరమ్మతుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/ మధిర :** మధిర ఆర్వోబిపై జరుగుతున్న మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మార్పీఎస్ మధిర మండల అధ్యక్షులు మేకల రాజా కోరారు. మంగళవారం ఆర్వోబిని నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్వోబిపై పెద్ద పెద్ద గుంతల పడి చువ్వలు బయటకు రావడంతో గత కొన్ని రోజులుగా రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది గాయాలపాలవుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. గత రాత్రి ఆర్వోబిపై ఉన్న గుంత వలన జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహిళకు తీవ్రగాయాలై రెండు కాళ్లు విరిగిపోయాయని, అలాగే ప్రమాదకరంగా ఉన్న ఆర్వోబిపై యువత ద్విచక్రవాహనాలను అతివేగంగా నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గుర్తై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్వోబి మరమ్మత్తు పనులను వేగవంతం చేసి పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి దోర్నాల ఆంజనేయులు, యూత్ నాయకులు పాల్గొన్నారు.



# కలిసికట్టుగా పరిశ్రమలు నడుపుకుంటేనే లాభాలు

**- ఐటిడిఏ పిఓ రాహుల్**




**ప్రజాపక్షం/ఖమ్మం:** చిన్నతరహా పరిశ్రమల ద్వారా జీవనోపాధి పొందుతున్న యూనిట్ సభ్యులు కలిసికట్టుగా పనిచేస్తే లాభాల పంట పడుతుందని, తద్వారా పది మందికి ఉపాధి కల్పించవచ్చని ఐటిడిఏ పిఓ బి రాహుల్ అన్నారు. మంగళవారం వైటిసిలో సెంట్రల్ ఇనిస్టిట్యూట్ టూల్స్ డిజైన్ సంస్థ ఆధ్వర్యంలో ఎంఎస్ఎం యూనియ్ సభ్యుల శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ ఐటిడిఏ ద్వారా నిరుద్యోగులైన యువతీయువకుల కోసం ఎంఎస్ఎంఇ పథకం ద్వారా వివిధ రకాల చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పుకునేందుకు తోడ్పాటు అందించినట్లు చెప్పారు. యూనిట్ సభ్యులు మార్కెటింగ్ సౌకర్యం కల్పించుకోవాలని, ముడి సరుకులు అధిక ధరలకు కొనుగోలు చేయకుండా సీజనల్ ప్రకారం కొనుగోలు చేయాలని, ప్రతి అంశంలో రిజిష్ట్రేషన్ తప్పని సరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ డేవిడ్ రాజ్, ఉదయ్ కుమార్, విజయ్ కుమార్, హరికృష్ణతో పాటు వివిధ యూనిట్ల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

**ప్రజాపక్షం/ మధిర :** మండల పరిధి ఆత్కూరు గ్రామంలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం నందు దాతల సహకారంతో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి పార్టీ నాయకులు వేమూరి సునీల్ సతీమణి స్వర్గీయ నాగరాణి 4వ వర్ధంతి సందర్భంగా భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు వెలగపూడి హన్మంతరావు, డాలు కృష్ణ తెలిపారు. దాతల సహకారంతో ప్రతి మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, అన్నదానానికి సహకరిస్తున్న దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# దివ్యాంగులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన వ్యాపార నైపుణ్య శిక్షణ ను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ దివ్యాంగుల జేఏసీ చైర్మన్ టీ.వీ.చలమయ్య సూచించారు. ఆర్సీపీ అండ్ ఎస్ఆర్‌డీఎస్, దివ్యాంగుల జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన శిక్షణ ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దివ్యాంగులు ఆయా బ్యాకుల వద్ద రుణాలు పొంది స్వయం కృషి తో ముందుకు సాగాలని సూచించారు. దివ్యాంగులు ఆత్మగౌరవంతో నిలబడేందుకు శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. దివ్యాంగు లకు ఇచ్చే శిక్షణ ను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వాలంభన సాధించాలని సూచించారు. కావునా దివ్యాంగులు ఈ అవకాశం ను వినియోగించుకోవాలని సూచించారు. ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు దోసపాటి శేఖర్ మాట్లాడారు. దివ్యాంగులకు సంఘం తరపున అవసరమైన వారికి వడ్డి లేని రుణాలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.



# క్షయ వ్యాధిపై అవగాహన

**ప్రజాపక్షం/ఖమ్మం:** మండల పరిధిలోని చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో వాచానాయక్ తండ గ్రామంలో టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించి లక్షణాలు ఉన్నట్లయితే కళ్ళె నమూనా సేకరించడం జరుగుతున్నదని చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో పలు గ్రామాలలో ఆరోగ్య కేంద్రముల లో ప్రతి పంచాయతీని టిబి లేని గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు వైద్యులు తబస్సుమ్ తెలిపారు. టిబి రాకుండా ఉండేందుకు పలు జాగ్రత్తలు, సలహాలు సూచనలు కల్పిస్తున్నట్లు పర్యవేక్షకులు శ్రీకర్ తెలిపారు టీబీ వ్యాధి అంటరాని వ్యాధి కాదని అంటువ్యాధి అని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అనుమానం ఉంటే పరీక్షలు ఉచితంగా చేయించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఆరోగ్య కార్యకర్తలు ఆశాలు అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు.



# నేటి నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 19 న మండల కేంద్రాల్లో జరుగుతున్న నిరసన కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వామపక్ష కమ్యూనిస్టు పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో జరిగిన ఉమ్మడి సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద ప్రజలకు నష్టదాయకంగా ఉందని ఆరోపించారు. బడా పెట్టుబడిదారులు కార్పొరేట్ శక్తులైన అదాని అంబానీలకు అనుకూలంగా ఉందని ఎద్దేవా చేశారు. మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చిన దగ్గరనుంచి పేదలపై భారం వేస్తూ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాడని వారు దుయ్యబట్టారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు, కేంద్ర బడ్జెట్ కు నిరసనగా జరుగుతున్న కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జాటోత్ కృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి యాస నరేష్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి వల్లోజి రమేష్, మాస్ లైన్ జిల్లా నాయకులు ఏదులాపురం గోపాలరావు, మండల కార్యదర్శి బానోత్ ధర్మ, సిపిఐ మండల నాయకులు ఎల్లంకి మధు, చాంద్ పాషా, సిపిఎం మండల నాయకులు వల్లమల చందర్ రావు, ఈశ్వర్, అభిమిత్ర తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఉద్యోగుల్లో బదిలీలు సహజం




**ప్రజాపక్షం/ఖమ్మం:** ప్రభుత్వ ఉద్యోగాల్లో బదిలీలు సహజమేనని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. స్థానిక రైతువేదికలో మండలంలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఎంఈవోకు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఏన్కూ రు మండలంలో మండల విద్యాశాఖ అధికారిగా దుగ్గిరాల జయరాజు పనిచేసి బదిలీపై కారేపల్లి మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 9 సంవత్సరాలుగా మండల విద్యాశాఖ అధికారిగా పనిచేసి ఉపాధ్యాయులను గాడిలో పెట్టి పాఠశాలలను తీర్చిదిద్దారని తెలిపారు. ఉపాధ్యాయులతో, మండల అధికారులతో కలిసిమెలిసి పనిచేసి అధికారుల మన్ననలను పొందారని తెలిపారు. కారేపల్లి మండలంలో ఇక్కడ అలాగే పనిచేస్తూ వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కూరాకుల సైదయ్య, మన్మోహన్‌రెడ్డి, రహీంబి, ఉపాధ్యాయులు చైతన్య భారతి, రామచంద్రు, పుల్లయ్య, బత్తుల వెంకటేశ్వర్లు, చింతా రాజు, జరుపల శ్రీను, సిఆర్పిలు లచ్చిరాం, కృష్ణప్రసాద్, శివాజీ, గిరి, లత పాల్గొన్నారు.

# కృష్ణయ్య ఆశయసాధనకు పునరంకితమవుదాం



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** సుదీర్ఘ కాలం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టు పార్టీ విస్తరణ కోసం పనిచేసిన హనుమంతు కృష్ణయ్య ఆశయ సాధన కోసం పునరంకితం కావాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. హనుమంతు కృష్ణయ్య 20వ వర్ధంతి మంగళవారం కామంచికల్‌లో నిర్వహించారు. ఆయన స్తూపం వద్ద అరుణ పతాకాన్ని ఆవిష్కరించి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ తుదిశ్వాస వరకు ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ పురోభివృద్ధి కోసం కృషి చేశారని అనేక నిర్బంధాలు ఎదురైనా ఎర్ర జెండా నీడనే ముందుకు సాగారన్నారు. ప్రస్తుతం పేద, మధ్య తరగతి ప్రజలను పట్టించుకునే స్థితిలో పాలక వర్గాలు లేవని హేమంతరావు ఆరోపించారు. కార్పొరేట్ సేవలో మోడీ ప్రభుత్వం తరిస్తుందని ఆయన తెలిపారు. దేశంలో ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్నాయని ఇది భవిష్యత్తులో దేశంలో అంతర్యుద్ధానికి దారి తీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ఉత్సవాలను వాడ వాడలా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. డిసెంబర్ 26న ఖమ్మంలో చారిత్రిక సభ జరగనుందని ఆయన తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించడమే అమరులకు మనమిచ్చే సరైన నివాళి అన్నారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు సిద్దినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభయలు పోటు కళావతి, మందడపు రాణి, జిల్లా నాయకులు పుచ్చకాయల కమలాకర్, బోజడ్ల సూర్యం, హనుమంతు కృష్ణయ్య తనయుడు హనుమంతు రాము, బత్తిని సీతారాములు, బొప్పి గాంధీ, కాళంగి మోహన్‌రావు, వెంకటకృష్ణారావు, ఎస్‌కె షాహీన్, యాదాల లింగయ్య, నూర్‌షా, శారద, లక్ష్మి, వెంకటకృష్ణ, ఉపేందర్, శంకర్, సోమ్లా స్థానిక నేతలు పాల్గొన్నారు.

# సిఎం, డిప్యూటీ సిఎంలను సన్మానించిన డిసిసిబి ఛైర్మన్లు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కలను జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల ఛైర్మన్లు సన్మానించారు. మంగళవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కలను పలు జిల్లాల డిసిసిబి ఛైర్మన్లతో పాటు ఖమ్మం డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం శాలువలతో సత్కరించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, సహకార సంఘాల పదవి కాలాన్ని ఆరు నెలల పాటు పొడిగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# కన్నుల పండుగగా స్థంభాద్రి గిరి ప్రదక్షిణ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** స్థంభాద్రి శ్రీ లక్ష్మి నర్సింహాస్వామి గిరి ప్రదక్షిణ కన్నుల పండుగగా జరిగింది. అరుణాచలం, యాదగిరి గుట్ట గిరి ప్రదక్షిణ మాదిరిగానే ఖమ్మంలోనూ స్థంభాద్రి గిరి ప్రదక్షిణ నిర్వహించారు. స్థంభాద్రి చరిత్రను మరింతగా కీర్తింపజేసేలా మొట్టమొదటి సారిగా మంగళవారం లక్ష్మి నర్సింహాస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా గిరి ప్రదక్షిణ నిర్వహించారు. స్థంభాద్రి గుట్ట చుట్టూ స్వామి వారి ఊరేగింపుతో గిరి ప్రదక్షిణ చేపట్టారు. ఈ గిరి ప్రదక్షిణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గుట్ట చుట్టూ ప్రదక్షిణ చేశారు. గిరి ప్రదక్షిణ అనంతరం దివ్యజ్యోతి దర్శనాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి నెల స్వాతి నక్షత్రం రోజున గిరి ప్రదక్షిణ సాయంత్రం 5.30 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఈవో కొత్తూరు జగన్‌మోహన్‌రావు తెలిపారు.

# అటానమస్ గుర్తింపు పొందిన సాయిస్ఫూర్తి కళాశాల




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని బేతుపల్లి గంగారంలో గల సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల అటానమస్ గుర్తింపును సాధించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్/జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైద్రాబాద్ ద్వారా ప్రతిష్టాత్మకమైన అటానమస్ (స్వయం ప్రతిపత్తి) గుర్తింపు ఏ.వై:202526 సంవత్సరం నుండి లభించిందన్నారు. తమ కళాశాలకు యూజిసి/జె.ఎన్.టి.యూ.హెచ్ అందించే ప్రతిష్టాత్మకమైన అటానమస్ (స్వయం ప్రతిపత్తి) గుర్తింపు లభించినట్లు ఆయన తెలిపారు. తమ కళాశాల ఈ ఘనత సాధించిన సందర్భంగా అధ్యాపక బృందానికి, సిబ్బందికి, విద్యార్థినీ, విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సామర్థ్యత, ఆధునిక మౌలిక వసతులు, అనుభవం కలిగిన అధ్యాపకుల కృషి ద్వారా ఈ ఘనత సాధించుకోగలిగామన్నారు. అటానమస్ (స్వయం ప్రతిపత్తి) ద్వారా సాంకేతిక మార్పులకు అనుగుణంగా పాఠ్యాంశాలను, కోర్సులను మార్చుకునే అవకాశం ఉందన్నారు. ఈ గుర్తింపుతో తమకు మరింత బాధ్యత పెరిగిందన్నారు.

# ఇసుక అక్రమ రవాణా

### -ట్రాక్టర్ డోజర్ సీజ్...



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న జెసిబిని ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులను జూలూరుపాడు ఎస్సై బాధవత్ రవి అదుపులోకి తీసుకొని మంగళవారం కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో మండలంలోని కరివారిగూడెం గ్రామ శివారు పెద్ద వాగు నుండి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న కొమ్ముగూడెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ భూక్య జస్వంత్, రాచబండ్ల కోయగూడెం గ్రామానికి చెందిన జెసిబి డ్రైవర్ పద్దం హరి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని ఉద్దేశం కలిగి ఉండి బ్రోకర్‌గా ఉండి ఇసుక తోలకాలు చేస్తున్న కొమ్ముగూడెం గ్రామానికి చెందిన భూక్య సక్రులపై కేసు నమోదు చేశారు.

# ముస్లింలు శాంతిని నెలకొల్వేవారు..

**సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి**




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ముస్లింలంటే శాంతిని నెలకొల్పే వారని, ఉగ్రవాదులుగా చూడటం సబబు కాదన్నారు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్. మంగళవారం పట్టణంలోని లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్ లో "ఇస్తేఖ్ బాల్ ఏ రంజాన్, రంజాన్ మాసానికి స్వాగతం" అనే కార్యక్రమం పవిత్ర రంజాన్ రాక సందర్భంగా జమాతే ఇస్లామి హింద్ మహిళా విభాగం సత్తుపల్లి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్తుపల్లి శాసన సభ్యురాలు డా. మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్ హాజరైనారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ మహిళా విభాగం సత్తుపల్లి అధ్యక్షురాలు దౌలతున్నిసా బేగం మాట్లాడుతూ మంచి, మానవత్వాన్ని పెంచి, సమాజం లో శాంతి సామరస్యాన్ని పెంచే రంజాన్ మాసానికి స్వాగతమన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపవాసాల ద్వారా ఆకలి అంటే ఏమిటోఆచరణతో తెలుసుకుని పేదవారిని ఆదుకునే గుణం అలవడుతుందన్నారు. ముస్లింలను కొంత మంది ఉగ్రవాదుల్లా చిత్రీకరిస్తున్నారని, అది సబబు కాదని ముస్లింలంటేనే శాంతిని నెలకొల్పే వారన్నారు. రంజాన్ మాసంలో ఉపవాసం ఉండి పేద ముస్లింలకు దాన ధర్మాలు చేసే సాంప్రదాయం చూస్తే నా మనసుకు ఎంతో ఆనందంగా ఉంటుదన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్రత్ భాను సాహెబా, జె ఐ హెచ్ రాష్ట్ర సెక్రటరీ, అస్మా అంజుమ్ సాహెబ్, జె ఐ హెచ్ ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు, ఫౌజియ బేగం, రీనా ఇంకా మోతి సాహెబా, పర్వీన్ సాహెబా తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అల్పాహారం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండల పరిధిలోని పాలడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులకు మంగళవారం పాఠశాల పూర్వ విద్యార్థులు మోదగు వినోద్‌కుమార్, కాకాని శ్రీవాణిలు అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రతిరోజు ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం అల్పాహారం అందించడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. అయితే తాము కూడా ఇదే పాఠశాలలో అప్పటి పాఠశాల ఉపాధ్యాయులు, ప్రస్తుత మండల విద్యాశాఖ అధికారి కొత్తపల్లి వెంకటేశ్వర్లు అందించిన స్ఫూర్తితో తాము విద్యనభ్యసించామని, చదువుకునే విద్యార్థులు ఉంటే తమకెంతో ఇష్టమని విద్యార్థులకు ప్రభుత్వం అందించే అల్పాహారంతో పాటు తాము ఒకరోజు అందించాలని నిర్ణయం తీసుకున్నామని ప్రతిఒక్కరూ మంచిగా చదువుకొని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిఎం కార్యాలయం ప్రారంభించాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లిలో సింగరేణి జిఎం కార్యాలయాన్ని ప్రారంభించాలని సింగరేణి గుర్తింపు సంఘమైన ఐ.ఎన్.టి.యూ.సీ నాయకులు కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ ఆదేశాల మేరకు ఐ.ఎన్.టి.యు.సి ఆధ్వర్యంలో కొప్పుల వెంకటేశ్వర్లు డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్)కి మంగళవారం వినతి పత్రం అందజేశారు. సత్తుపల్లి నుండి సుమారు పన్నెండు మిలియన్ టన్నుల (12.4) బొగ్గు ఉత్పత్తి, రవాణా చేస్తున్న ఉద్యోగుల సంక్షేమం, పలు సమస్యల పరిష్కారానికై వెంటనే జి.ఎం కార్యాలయం ప్రారంభించాలని కోరారు. సత్తుపల్లి సింగరేణిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 3500 మంది ఉద్యోగుల కుటుంబాలు, భూనిర్వాసితుల కుటుంబాల ఆరోగ్యం విషయమై జే.వి.ఆర్ డిస్పెన్సరీని అన్ని వసతులతో ఏరియా హాస్పిటల్ గా ఆధునికరించాలన్నారు. ఉద్యోగులు నివసించే పి.వి.ఎన్ కాలనీ ప్రారంభించి సుమారు మూడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ కమ్యూనిటీ హాల్, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, సూపర్ బజార్ వంటి మౌలిక సదుపాయాలు లేవని తక్షణమే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఐ.ఎన్.టి.యు.సి జి.ఎం చర్చల ప్రతినిధి చెన్నకేశవరావు, బ్రాంచ్ సెక్రటరీ తీగల క్రాంతి కుమార్, జాయింట్ సెక్రెటరీ నాగ ప్రకాష్, రామారావు (ఫిట్ సెక్రటరీ , జె.వి.ఆర్ ఓ.సి ), నాగేశ్వరరావు (ఫిట్ సెక్రటరీ, జె. వి.ఆర్ సి.హెచ్‌పి), బాలాజీ ( ఫిట్ సెక్రటరీ, కిష్టారం ఓసి), అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు కోటి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్, కాంగ్రెస్‌లు ప్రజలను మోసం చేశాయి..



**-317 జీవోకు వ్యతిరేకంగా కొట్లాడింది బిజెపినే**
**-సరోత్తమ్‌రెడ్డిని గెలిపించండి**
**-బిజెపి నేత ఈటల రాజేందర్**

**ప్రజాపక్షం/ఖమ్మం :** కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు తెలంగాణ ప్రజలను మోసం చేశాయని పార్లమెంట్ సభ్యులు, బిజెపి నాయకులు ఈటల రాజేందర్ ఆరోపించారు. 317 జీవో తెచ్చి ఉపాధ్యాయుల బతుకుల్లో మట్టి కొట్టారని ఆయన తెలిపారు. మంగళవారం ఖమ్మంలో జరిగిన మీడియా సమావేశంలో ఈటల మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 317 జీవోలో మార్పులు తెస్తానని చెప్పి చేయలేదని ఆయన గుర్తు చేశారు. సిపిఎస్ పెన్షన్ వద్దనుకుంటే కేంద్ర, రాష్ట్రాలకు ఆప్షన్ ఇచ్చిందని దానిని తెలంగాణ అమలు చేయడం లేదని అప్పటి కేసిఆర్ కానీ ఇప్పుడు రేవంత్‌రెడ్డి కానీ దీనిపై తమ విధానాన్ని ప్రకటించ లేదన్నారు. 2014కు ముందు జాతీయ రహదారులు, విమానయానం, రైల్వేల పరిస్థితి ఇప్పటితో పోలిస్తే చాలా మెరుగైందన్నారు. కాంగ్రెస్‌లో స్కాములు ఉండేవని ఇప్పుడు మచ్చ లేకుండా బిజెపి పాలన సాగుతుందన్నారు. అమెరికా అధ్యక్షుడే భారత ప్రధానికి కుర్చీ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కుల గణన శాస్త్రీయంగా చేయాలని  కుల గణనకు సంబంధించి ఒక్కో రాష్ట్రంలో ఒక్కో కులానికి రిజర్వేషన్ ఉందని తమిళనాడు, బీహార్ రాష్ట్రాలు చట్టబద్ధంగా కమిటీలు వేసి కుల గణన చేశాయని ఈటల తెలిపారు. జనాభా పెరుగుతుంటే బిసి జనాభా ఎలా తగ్గిందని ఆయన ప్రశ్నించారు. 2011లో 3.61 కోట్లు ఉన్న జనాభా ఇప్పుడు మరింత పెరగాల్సిందిపోయి ఎందుకు తగ్గిందని ఆయన ప్రశ్నించారు. బయ్యారం ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు కేంద్రం సిద్ధంగా ఉందని రాష్ట్రం ప్రాజెక్టు రిపోర్టు పంపలేదని ఆయన తెలిపారు. హామీలు అమలు చేసే దానికంటే అసైన్డ్ భూములు గుంజుకోవడం, హైడ్రా పేరుతో కూల్చివేతలు పెరిగిపోయాయని రేవంత్ మాటల గారడీ చేస్తున్నారని ఈటల ఆరోపించారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా బిజెపి బలపర్చిన సరోత్తమ్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు.ఈ మీడియా సమావేశంలో మాజీ ఎంపి సీతారాం నాయక్, మాజీ ఎంఎల్‌ఎలు బేతి సుభాష్‌రెడ్డి, సైదిరెడ్డి, ఖమ్మంజిల్లా బిజెపి అధ్యక్షులు గల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అప్పలనరసింహాపురంలో
# రెవెన్యూ, వ్యవసాయ, ఆరోగ్య శాఖల సంయుక్త విచారణ

**పంటలను పరిశీలించిన అధికారులు**






**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలంలోని అప్పలనరసింహాపురం లో ఫ్యాక్టరీల వలన నష్టపోతున్నామని స్థానిక బాధిత రైతులు ఫిర్యాదు చేయగా కలెక్టర్ స్పందించి విచారణ కు ఆదేశించారు.  ఈ మేరకు మంగళవారం విచారణ చేపట్టారు. గ్రామంలో యంస్, పీయంర్ పేరుతో కేమికల్ ఫ్యాక్టరీ వల్ల వచ్చే వసనకు తదితర పరిసరాల్లో ఉన్న పంట పొలాల్లో వుండలేక పోతున్నాం ఆ వాసన వలన దగ్గు, దురద, కిడ్నిల సంబందిత వ్యాదులు బారిన పడుతున్నాట్లుగా వాపోయారు. భద్రాద్రి ఐరన్ ఓర్ ఫ్యాక్టరీ వలన పరిసర ప్రాంతాలలో ఉన్న వ్యవసాయ పంటలు మాసి బారి పుత కాత కోల్పోయి పంట నష్టం అవుతుంది అని మా గ్రామ చెరువు లో నీరు కూడా నల్లగా మారి పశువుల సైతం మృత్యువాత పడుతున్నాయి అని బాధితులు ఆరోపించారు.  రెవిన్యూ, వ్యవసాయ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సంయుక్తంగా మంగళవారం క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. ఫ్యాక్టరీ పరిధిలోని వివిధ రకాల పంటలను పరిశీలించారు. దుమ్ము, దూళితో కలిగిన పంటలను పరిశీలించారు. వైద్యశాఖ అధికారులు గ్రామంలో, వ్యవసాయ బావుల వద్ద నీటిని "సేకరించారు. నీటిలో కలుషితం అవుతున్నాయా లేదా అనే వాటిని తెలుచుకునేందుకు ల్యాబ్ కు పంపించారు. అనంతరం గ్రామంలో రైతులు, గ్రామస్థుల తో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జె.మాణిక్యారావు, ఏయంఒ, వెంకట్రావు యాదవ్, వ్యవసాయ అధికారిని యం.రాధ, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మధుసూదన్, ఏఇఓ ఈశ్వరి పంచాయతీ కార్యదర్శి గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో అనుమతిలేని రక్త పరీక్ష కేంద్రాలు..?

**-టెస్ట్‌లు పేరుతో దోపిడీ**
**-వైద్యశాఖలో సహకరిస్తుంది ఎవరు..?**





**ప్రజాపక్షం/వైరా:** వైరాలో పుట్టగొడుగుల్లా రక్త పరీక్షా కేంద్రాలు రోజు రోజుకు పుట్టుకొస్తున్నాయి. హాస్పిటల్‌కు సంబంధం లేకుండా కొంత మంది కొన్ని ప్రాంతాల్లో రక్త పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ రక్త పరీక్ష కేంద్రాలు వైద్యశాఖ అనుమతి తీసుకున్నారా? అనేదానిపై కూడా వైద్యశాఖ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపడితే వాస్తవాలు బయటికి వస్తాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపంలో ఓ మొలలు హాస్పిటల్ ఏర్పాటు చేశారు. ఆ మొలల హాస్పిటల్ నిర్వాహకుడు దాని సమీపంలోనే ఉన్న రక్త పరీక్ష కేంద్రాల నిర్వహకులు మధ్య కుదిరిన ఒప్పందంతో సరికొత్త దందాకు తెర లేపుతున్నారు. అనుమతి లేని మొలలు హాస్పిటల్ వైరాలో కొనసాగుతున్నాయి. ఈ మొలలు హాస్పిటల్ వద్దకు వచ్చిన సామాన్య ప్రజలను వైద్యంపేరుతో రకరకాల టెస్ట్‌లు చేయాలని చెప్పి వారికి టెస్ట్‌లు వ్రాసి సమీపంలో ఉన్న రక్త పరీక్ష కేంద్రానికి పంపిస్తున్నారు. ఈ టెస్ట్‌ల పేరుతో వేల రూపాయల డబ్బులను దండుకుంటున్నారు. జిల్లా వైద్యశాఖ అధికారులు ఇప్పటివరకు ఇటీవల కాలంలో అనుమతి లేని రక్త పరీక్ష కేంద్రాలపై తనిఖీలు నిర్వహించిన సందర్భాలు లేవు. ఆ రక్త పరీక్ష కేంద్రాలకు అర్హతలు ఉన్నాయా లేవా అనేది కూడా పట్టించుకున్న సందర్భం లేదు. హాస్పిటల్స్‌కు అనుసంధానం లేకుండానే పెద్ద ఎత్తున రక్త పరీక్ష కేంద్రాలు వైరాలో ఏర్పాటు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఎవరన్నా అధికారులు తనిఖీలు వస్తుంటే ముందుగానే వారికి సమాచారం ఇవ్వడం ఇక్కడ ఆనవాయితీ, దీంతో అధికారులు తనిఖీలకు వస్తున్నారని సమయంలో రక్త పరీక్ష కేంద్రాలు తెరవకుండా అలాగే ఉంచుతారు. జిల్లా వైద్యశాఖలో కొంతమంది అధజకారులు అనుమతి లేని రక్త పరీక్ష కేంద్రాల నిర్వహణకు తొత్తులుగా మారారని వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా వైద్య అధికారి జోక్యం చేసుకొని అనుమతి లేని రక్త పరీక్ష కేంద్రాలపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# పదవ తరగతి పరీక్షలపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు నందు గల సాయి ఎక్స్‌లెంట్ స్కూల్లో మంగళవారం పదవ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు పరీక్షల భయాన్ని పోగొట్టి పరీక్షల్లో మంచి మార్కులు సంపాదించే విధంగా వ్యక్తిత్వ వికాస శిక్షకులు సురేంద్ర అవగాహన కల్పించారు. ఇష్టపడి చదివితేనే మంచి మార్కులు వస్తాయని, పరీక్షల టైంలో పొద్దున్నే లేచి మెడిటేషన్ చెసి ఏకాగ్రత తో చదివితే సబ్జెక్టు గుర్తుంటుందని, సమయ పాలన, తీవ్రమైన కోరిక, ఆత్మ ధైర్యం, ఒత్తిడిని అధికమించే మార్గాలు వంటి వాటిపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్  కరస్పాండెంట్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించిన శ్రీ సివి రామన్ జూనియర్ కాలేజ్ వారికి ధన్యవాదాలు తెలిపారు. ప్రతి విద్యార్థి కష్టపడి మంచి మార్కులు సంపాదించేందుకు ఈ శిక్షణ చాలా అవసరం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ హుస్సేన్, కరస్పాండెంట్ కృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో రికార్డు సృష్టించిన టాలెంట్ స్కూల్



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** అంతర్జాతీయ మాతృ బాషా దినోత్సవం సందర్భంగా సత్తుపల్లిలో స్వర్గీయ గార్లపాటి పాపాచలం, స్వర్గీయ బొల్లేపల్లి సత్యనారాయణ రాజు, ఆశా స్వచ్ఛంద సంస్థ, గండ్ర రామిరెడ్డి లక్ష్మీ కాంతమ్మ స్మారక ట్రస్ట్ ల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వేమన శతక పద్య గళార్చనలో పట్టణంలోని సిద్ధారం రోడ్ లో గల టాలెంట్ స్కూల్ విద్యార్థులు 140 మంది విద్యార్థులు పాల్గొని, 100 పద్యాలను గళార్చన చేసి, తెలుగు రాష్ట్రాల స్థాయిలో రికార్డు నెలకొల్పారని టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ పులి శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ వేమన పద్య గళార్చన ద్వారా విద్యార్థులలో తెలుగు భాష పట్ల ప్రేమ కనిపించిందని, అందుకు తల్లిదండ్రులు కృషి కూడా మరువలేనిదన్నారు. 140 మంది విద్యార్థులకు సత్తుపల్లి మండల విద్యాశాఖాధికారి ఎన్. రాజేశ్వరరావు, జేవియర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ గోపి, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మధుసూదన్ రాజు, లైబ్రరీయన్ రామకృష్ణలు ప్రశంసా పత్రాలను అందజేశారు.

# అనుమతి లేని ఆసుపత్రి సీజ్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎటువంటి అనమతులు లేకుండా నడుపుతున్న పెయిన్ రిలీఫ్ ఆక్యుపంక్చర్ ఆసుపత్రిని వైద్య ఆరోగ్య శాఖాధికారులు సీజ్ చేశారు. మంగళవారం ఖమ్మం నగరంలోని కమాన్ బజార్ నందు గల పెయిన్ రిలీఫ్ ఆక్యుపంక్చర్ ఆసుపత్రిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ బి. కళావతి బాయి తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో డాక్టర్ విజయ్‌భాస్కర్ లేకపోవడం, ఆసుపత్రి ఏర్పాటుకు సంబంధించి రిజిస్ట్రేషన్ లేకపోవడాన్ని గుర్తించారు. వైద్యునికి సంబంధించిన అర్హతలు లేవని గుర్తించి ఆసుపత్రిని సీజ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అర్హతలు లేకుండా వైద్యం చేయడం నేరమని డిఎంఅండ్‌హెచ్‌వో తెలిపారు. అర్హత ఉంటే అలోపతిక్ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకుని ప్రాక్టీస్ చేయాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సైదులు, పివో డాక్టర్ చందునాయక్, డెమో సాంబశివరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సూపర్‌సెట్ హైదరాబాద్‌తో ప్రియదర్శిని ఒప్పందం




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని పెద్దతండాలో గల ప్రియదర్శిని మహిళల సాంకేతిక కళాశాలతో సూపర్‌సెట్ హైదరాబాద్‌తో అవగాహన ఒప్పందాన్ని మంగళవారం కుదిరించుకున్నారు. ఒప్పంద ప్రతాన్ని చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబుకు  సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌సెట్ రిలేషన్ మేనేజర్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. గోపాల్, అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకరమణ, కళాశాల విభాగాధిపతులు ఇంజం నర్సింహారావు, కంప్యూటర్ సైన్స్ ఎం వెంకటేశ్వరరావు, సీఎస్ఎం అండ్ ఏఐడి డి. రమేష్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ ఎన్ జయమ్మ, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తివారీ, మన్‌మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.